తిరుపతికొండ మెట్టు

అడివి బాపిరాజుగారు

శ్రీ తిరుమల మహాపుణ్యక్షేత్రంలో గాలి గోపురానికి పోయే మొదటిమెట్ల వరసలో సగము దాటినపైన ఏకాకి, కుంటి బిచ్చగాడు, పున్నెడు-నివాసం. ఏబిచ్చగాళ్ల ఋషికులానికి చెందకుండా పున్నెడు ఆశ్రమం ఏర్పరుచుకున్నాడు. రెండుకాళ్లూ మొండే. కాని వాడికున్న బలం విపరీతం. వాడు చేసే దొమ్మరి విద్యల సాహసం ఏ ఇసాకో గ్రాండు

“వేలాడుతూ చక్రంలా గిరగిర తిరుగుతాడు.”

రషియను సర్కసు జట్టులో వుండే పరమ సాహసికిన్నీ లేదు. చేతులతో మెట్లెక్కుతాడు. కోతిలా కొమ్మనుంచి కొమ్మకు ఎగిరి ఛంగున పోతాడు. వేలాడుతూ చక్రంలా గిర గిర తిరుగుతాడు. దేహమంతా వాలఖిల్య మునిలా పైకెత్తి వేళ్లమీద తలక్రిందులా నిలబడి నడుస్తాడు. మెట్టుమీదనుంచి పైమెట్టుకి బంతిలా ఎగురుతాడు. ఒంటిచేతిమీద నిలుస్తూ, చేతుల్లోంచి దేహమంతా దూరుస్తూ చూపించే విచిత్రపు ఆసనాలా, మొగ్గలా ముందర హఠయోగి విరూపానందస్వామి యోగవిద్య గాని, జపానుమాంత్రికుడు మసుకాకో కనబరచే “ఫీట్లు” గాని, నూరువోల్టుల ఎలక్ట్రిక్ దీపంముందర పడకగదిదీపంబుడ్డిలా తెలతెలపోవలసినదే!

యాత్రికులతండాల మేఘాలు పున్నెడు ముందర ఆగి, ఆతని అద్భుతచర్యల చూసి విస్తుపోయి దమ్మిడీలు, కానులు, అణాలు వర్షం కురిపిస్తే, రాత్రి తొమ్మిది అయ్యేటప్పటికి అయిదూ, ఆరు రూపాయల చిల్లర చెరువులు కట్టుంది. ఏబ్రహ్మోత్సవమో అయితే పది పదిహేను రూపాయలు పోగుచేసా డన్న మాటే. తిరుపతికొండల ఎక్కుదిగుడుల ఏడు మైళ్లలో ఉన్న మూడువందల ఏబదియారు బిచ్చగాళ్లలో పున్నెడుకు వచ్చే రాబడి ఇంక

ఎవరికీ లేదు. వికలాంగులు ఉన్నారు. ముక్కునోరు అంతా ఏకరంధ్ర మైనవారు, కుష్టురోగులు, మాంత్రికులు, సన్న్యాసులు, ముళ్ల మీాద హంసతూలికాతల్పంమీాదలా పండుకొనే యోగీశ్వరులు, గుడ్డివారు, కోకిలకంఠంతో పాడే గాయకులు, ఆడవాళ్లు, మగవాళ్లు, బిడ్డలు; భయం కలుగచేసేవి, కళాసౌందర్యం వెల్లివిరియజేసేవి విగ్రహాలను ముందుంచుకొని పూజారిపని చేసేవారు—ఎన్నిరకాలున్నారో తిరుమలేశ్వరుని కొలువుచేసే అయ్యంగార్లు, అయ్యరులు, అయ్యలు, రెడ్లు, మొదలియారులు, సెట్లతోపాటు, కోతులతోపాటు, ఈ బిచ్చకుల బృందాలు!

ఆ విచిత్రప్రపంచంలో ఉన్న బిచ్చగాళ్లంతా పున్నెణ్ణి చూసి అసహ్యించుకునేవారు. పున్నెడు ముష్టివాళ్లందరకూ విరోధి అయిపోయినాడు. వాడి సంపాదన వాళ్లకడుపు మండజేసింది. వారికి ఉడుకుబోతుతనం కాశ్మీరదేశాన్ని సహారా ఎడారి చేయగలశక్తితో విజృంభించింది. ధర్మప్రవాహాలు వాడిదగ్గిర ఆనకట్టకట్టబడి నిర్జలవాహినులు కొండంతా ప్రవహిస్తున్నవి. పున్నెణ్ణి త్వరగా కొండమీాదనుంచి జపానువారు చీనాను తరిమినట్లుగా నెట్టివేయవలెనని బిచ్చగాళ్ల సంఘంలో సంచలనం కలిగింది. వారిలో ఏకబురున్నా తీగలేనివార్తలా నిమిషంలో ఆకొండలోయల మోకాళ్లపర్వతం చుక్కలపర్వతం ఏడుమైళ్లూ వ్యాపిస్తుంది. పున్నెణ్ణి శ్రీ వేంకటేశ్వర సన్నిహిత భక్తబృందంలోంచి రెండువేల మైళ్లన్నా విసిరివేసేటందుకు ఒక మాఘ శుద్ధ ఏకాదశినాడు బిచ్చకుల ఆశ్రమాలన్నీ తీర్మానించుకున్నవి.

ఆతీర్మానం ప్రకారము బిచ్చగాళ్లకు అన్నము, సాంబారు అమ్మేవాళ్లు అమ్మడం మానివేసినారు. నీరు తెచ్చేవాళ్లు నీరు తేవడం మానివేశారు. సరుకులు ఏడుమైళ్ల దారిపొడుగునా విక్రయించేవాళ్లు విక్రయించడం మానివేశారు. పున్నెడు మొదట వేళాకోళ మనుకున్నాడు. క్రిందఆశ్రమంలో వున్న దిగుడుబావిలోనుంచి నీళ్లు పై ఆశ్రమాలవాళ్లకి విడిబిచ్చగాళ్లకి అమ్మేనీళ్లమనిషి పున్నెణ్ణి వెక్కి—

"......పున్నెణ్ణి వెక్కిరిస్తూ......"

రించి, "నీళ్లు నీళ్లు" అని పున్నెడు గోలపెట్టున్నా నడుమూ కటిభారం ఆడించుకుంటూ వెళ్లిపోయింది. పున్నెడికి కళ్లు పచ్చబడ్డాయి.

చెట్టునీడనే కూలబడి తలమొండికాళ్ల మీద ఆన్చి వున్నాడు. ఆలోచనలో మునిగిపోయాడు. తనజీవిత మంతా ఒక్కసారిగా ఫిల్ము తిరిగినట్లు పొడచూపింది.

పున్నెడు అనంతపురం జిల్లాలోని ఒక గ్రామములో నివసించే అభిమానవంతులైన ఒకరెడ్డికులంలో ఉద్భవించాడు. ఆవూరి రెడ్డివారికి పక్కగ్రామం రెడ్డివారికి ఒకగ్రామం తగాదా వచ్చి కురుపాండవయుద్ధ మైపోయింది. అప్పుడు పున్నెడిపేరు పుణ్యాంరెడ్డి. పుణ్యాంరెడ్డి తండ్రినీన్నీ, ముగ్గురు అన్నదమ్ములు, వీరస్వర్గం అలంకరించారు. పుణ్యాంరెడ్డి కాళ్లు రెండూ విరిగినాయి. ఆస్పత్రిలో రెండుకాళ్లూ ఛేదించి మొండిజగ్గణ్ణి చేసినారు. కుటుంబం యావత్తు నశించిన వెనుక వ్యాజ్యాలలో ఆస్తీ మాయమైంది. కతిపయ ప్రయాణాలు చేసి రెండేళ్లకు వెంకటాచల సోపానపంక్తి రెండవ శేషాచలపతిలా అవతరించినాడు పుణ్యాంరెడ్డి. ఇంక రెండేళ్లలో పున్నెడయ్యాడు రెడ్డి.

పూర్వచరిత్ర లన్నీ మాయమై పున్నెడు కళ్ల రెండుచుక్కలు రాలినవి. అతనిగొంతుక ఎండినది. ఆకలితో మాడినాడు. కొండమీద దుకాణాలకు సరుకు అందుబాటుచేసే వర్తకులు వచ్చినప్పుడు పున్నెడు కొంతడబ్బ వారికి ఇచ్చి సాయింత్రానికి వంటసామగ్రి తెప్పించుకున్నాడు. డోలీలవాళ్లకు ఒకఅర్ధణా చేతిలోవేసి కుండెడునీళ్లు తెప్పించుకున్నాడు. ఆ సరుకుతో ఆనీటితో మూడురోజులుగడపినాడు.

నాలుగోరోజు తెల్లవారగట్ల మూడింటికి లేచి ముష్టికి తయ్యారైనాడు. తెల్లవారేవరకూ ఒకరూపాయిన్నర మూడుదమ్మిడీలు ప్రోగయినవి. ఇంతలో మామూలుగా కొండమీద దుకాణాలకు సరపరాదారుడు కందసామి వంటసామగ్రి తెచ్చియిచ్చే సమయ మైందని కొండపైకి దిగువకు చూసి ఆప్రక్కనే నాలుగుబారల దూరంలో తాను నిద్రపోవుటకు ఏర్పరచుకొన్న పొదకడకు పోయి ఒకపెద్దరాయి తీసి చూసినాడు: ఆతనికళ్లు తిరిగి, "అమ్మయో" అని వెనక్కు వాలిపోయినాడు. ఆరాత్రిక్రింద పున్నెడు దాచుకున్న అయిదువందల డెబ్బది అయిదు రూపాయల మూట మాయమైపోయింది. పున్నెడుప్రాణం మరిగిపోయింది. రాతిమీదనుంచి క్రిందకు కూలబడిపోయినాడు. కొంతసేపటికి ఆతనిమొగము జేవురించింది. ఈపని చేసినది మామూలుగా బిచ్చగాళ్లతో వర్తకంచేసే కుప్పుస్వామిపని అని అనుమానము తట్టినది. వట్రువలు తిరిగి, కండలు కట్టి, హనుమంతుని హస్తాలవంటి బలమైన ఆతనిచేతులు భయంకరంగా వంకరలు తిరిగినవి. ఆసమయంలో ఆతనిచేతుల కందిన ప్రాణి కబంధుని వాత బడినట్లే.

ఆరోజు దొరికిన డబ్బు నిచ్చి వంటసామగ్రి కొనుక్కున్నాడు పున్నెడు. ధనంతోపాటు



"కాని చల్లనిచేయి అతనిచేతిని పట్టి వెనక్కు లాగివేసింది."

ఆతనిబలమూ నశించింది, జీవితేచ్ఛా పోయినది. ప్రపంచంలో యుద్ధక్రమంగా సంసారయాత్ర చేసే ఆశ అడుగంటింది. తన విద్యలు చూపించి ముష్టి ఎత్తుట మానివేసినాడు. డబ్బు లేకపోతే తిండీ తిప్పలుపోయినవి. అయిదు రోజులయ్యేసరికి పున్నెడు అస్థిపంజర మై పోయినాడు. పున్నెడు దుర దృష్టము వెంకటాచలాన్ని రాళ్లలా ఆశ్రయించి యున్న వర్తకులు మొదలైన యావన్మందికీ తెలిసిపోయింది.

శేషాచల బిచ్చకుల లోకానికంతా సంతోషమైనది. వదులుతాడురా పిశాచి అనుకున్నారు. అందరికీ ఇక కొంచెమో గొప్పో దొరుకుతుంది. ఇదివరకు పున్నెడున్నంత కాలము అదృష్టదేవత అతన్నే ఆవహించింది. ఇంతటినుంచి కొండమెట్లదారి ఏడుమైళ్లు క్రిందికి పైకీ ఆమె తిరుగుతూ ఉంటుంది. మళ్లీ మంచిదినాలు వచ్చినవి—అనుకున్నారు.

నీరసించిపోయిన పున్నెడు ఆరోదినం రాత్రి స్పృహతెచ్చుకొని కొండమీదనుంచి పక్కనున్న లోయలోనికి ఉరికి వెంకటేశపాద సన్నిధి చేరుదామనుకున్నాడు. చేతులతో పాకి నూరడుగుల దూరంలో ఉన్న ఎత్తుబండల మీదికి పోయినాడు. గోవిందా! వెంకటరమణా, గోవిందా—అని ఉరకబోయినాడు.— కాని చల్లనిచేయి ఆతనిచేతిని పట్టి వెనక్కు లాగివేసింది

కళ్లు మూసుకున్న పున్నెడు శ్రీవెంకటేశ్వరుడు ప్రత్యక్షమైనాడనుకున్నాడు. ఆతని దేహము పులకరించింది. చల్లనిగాలులు ప్రసరించినట్లయింది. వెన్నెలలు పిండి ఆరగా కాచినట్లయింది. ఆతడు కళ్లు తెరిచే టప్పటికి ఎట్ట ఎదుట ఆచుట్టుప్రక్కల బిచ్చగాళ్ల ఆశ్రమాలికి నీళ్లు బోసే బోయపిల్ల కనబడినది. ఆమె తీరైన నల్లనిమొగమంతా నక్షత్రాలవెలుగుల కాంతిలో కళ్లనీళ్లు మెరుస్తు కనిపించింది. ఆమె వెక్కివెక్కి ఏడుస్తూ "పున్నెడు, నాను

బహుపాపిని! నిండా దోసం చేసినా. ఆగుమా సాల క్రిందు రోగంవచ్చి దుడ్డులేక నబ్బరపడి నప్పుడు పత్తురూపాయి రహస్యంగా పంపిన నీ చల్లనిగుండె నాను తలుచుకున్నా! చచ్చిన శుక్లపర్వతం కుష్టు ముసాలిదానికి నువ్వు చేసిన చాకిరిదా నాబడంబు తిప్పినది. ఓసామి నీవు దేవుండు! నీకు వీండ్లు పిశాచిలు, నిండా ద్రోగం తలపోసినారే! నానుకూడా సరిదా అంటెని! ఓయ్! ఓయ్! నాను నరరక్కసి! నాకు పదు నాలో కుంపిని నరకం!" అని పొంకహా వక్షం ఉబికిపోగా అతిదీనంగా పొర్లిపొర్లి వచ్చే ఏడు పును ఆపకుండా ఏడ్చింది.

పున్నెడు నిర్ఘాంతపోయినాడు. బోయపిల్ల మంగిని బలమైన చేతులతో దగ్గరకు లాక్కున్నాడు.

"పిల్లా, నాకు కల్గిన యీ సెబ్బరకు నాను దా దుఃఖం పొందేది లేదు. నిండా ఇంతకు మించి కష్టాలు తీర్నై ఈపాణికి; కాని అతి మెత్తని నీకుదా ఏడ ఈగెట్టిమణసు అని విచారింసినా! మొణ్ణ నీకళ్లు మేఘాల రాత్రిలా ఉంటినైదా. ఇంగ పెంపంచికంలో మంచీ, పున్నెం లేదని తోసినదే. ఏల ఈపాణి బతికేది! అంతదా!"

"ఓసామి, నన్ను చెమించు! నాను రక్కసి నిదా సెప్పంటినే! నీసొమ్మ్మా దుడ్డు ఏక దాచేది నాకుదా తెలుసునే! వాండ్లమాయలో చేరి వాండ్ల చెప్పినా! ఆపాపి కుప్పసామిదా తీసిండు అయ్యో."

పున్నెడు మొగం నవ్వింది. ఆతనిహృదయం వెన్నెల్లు కాసింది.

"పోమెలే! ఈపాణికి ఈచేతు లిచ్చిన వెంకటసామి చల్లగా, పదిఅయిదునూర్లు సంపాదించలేనా! నువ్వు నా దగ్గిరుండేది. అంతదా!" అని ఆమెను తనచేతుల్లోకి తీసుకుని తల ముద్దుపెట్టుకొన్నాడు. మంగి తాను తెచ్చిన మంచినీళ్లు, కూడు, పున్నెడుకి నెమ్మదిగా తినిపించింది.

చుక్కలు నవ్వినవి. తమవైపు తిరిగి మోకారించిన ఆ నూతన స్త్రీపురుషుల తలపై సేసలు చల్లినవి మంచుబిందువులు. శ్రీ వెంకటపతి తాను సలిపిన పెండ్లిళ్లకన్న ఇది మించినదనుకున్నాడా!

పెనుగొండలక్ష్మి

పుట్టపర్తి నారాయణాచార్యులుగారు

(కవితాపోషక సమితి, తిరుపతి)

గండపెండేరంబు ఘులుఘుల్లు మనుతానములతోడ దేశాక్షి బలుకునాడు
సులతాను లెల్ల తలలు వంచి గక్కుతురాయీల సిను బూజసేయునాడు
ఆదివరాహధ్వజాంతరంబుల నీడ నీకీర్తి బరు నీసడించునాడు
గుహాలలోపల దూరికొన్న యాగజపతి తలపైని నీకత్తి గులుకునాడు